రేషన్ బియ్యం పక్కదారి..

- అక్రమ సరఫరాపై పోలీసుల ఉక్కుపాదం
- నెలరోజుల వ్యవధిలో నియోజకవర్గ వ్యాప్తంగా 500 క్వింటాళ్ల పట్టివేత
- 15మంది నిందితులపై కేసు నమోదు
- బియ్యం పక్కదారి పట్టిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామంటున్న పోలీసులు

వీణవంక: నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతుండగా లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమార్కులు ఇతర ప్రాంతాలకు తరలించి అందినకాడికి దండుకుంటున్నారు. కొందరు డీలర్లు సహకరిస్తున్నారానే ఆరోపణలు వెలువడుతున్నాయి. రేషన్ బియ్యం దందాపై పోలీసులకు ఫిర్యాదులు రావడంతో అక్రమ రవాణాపై దృష్టి సాధించారు. నెల రోజుల వ్యవధిలో హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఏసీపీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో మెరుపుదాడులు చేశారు. అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరిస్తుండటంతో అక్రమార్కుల వెన్నులో వణుకు పుడుతోంది.

500క్వింటాళ్ల బియ్యం పట్టివేత

నెల రోజుల వ్యవధిలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో పోలీసులు 500 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. లారీ, ట్రాక్టర్, మూడు టాటా మ్యాజిక్ వాహనాలు, ఆటో, రెండు రైసు మిల్లులను సీజ్ చేసి 15 మందిపై కేసు నమోదు చేశారు. వీణవంక మండలంలోనే వారం వ్యవధిలో 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమ రేషన్ దందాకు తెరలేపారు. ముఠాగా



రేషన్ బియ్యం పట్టుకున్న వీణవంక పోలీసులు(ఫైల్)

ఏర్పడి దందా కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ప్రజల నుంచి రూ.10 కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలలో రూ.20 విక్రయిస్తున్నారు. గతంలో గ్రామాల్లో కొనుగోలు చేసిన బియ్యంను బిజిగిరిషరీఫ్ రైల్వే స్టేషన్ ఆవరణలో డంపు చేసి అక్కడి నుంచి నాగాపూర్ ప్యాసింజర్ రైలులో మహారాష్ట్రకు తరలించేవారు. కానీ ఇటీవల రైలు తరుచూ రద్దు అవుతుండటంతో పాత వాహనాలలో తరలించి ఇతర ప్రాంతాలలో విక్రయిస్తున్నారు. ఒకవేల పోలీసులకు పట్టుబడితే వాహనం వదిలేస్తున్నారు. అయితే ఓ రేషన్ డీలర్ పాత్రపై కూడా టాస్క్‌ఫోర్స్, పోలీసులు దృష్టి పెట్టినట్లు తెలిసింది. సదరు రేషన్ డీలర్ లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించి ఇతరులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై పోలీసులు నిఘా పెంచారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. రేషన్ దందాపై పక్క సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేసుందుకు సిద్ధమయ్యారు. వీణవంక ఎస్సై వంశీకృష్ణ పలు గ్రామాలలో పర్యటించి రేషన్ బియ్యంను అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

చట్ట ప్రకారం చర్యలు



పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవు. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. మండలంలో వారం రోజుల వ్యవధిలో 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నాం. నింధుతులపై కేసులు నమోదు చేశాం. ఇంకా గ్రామాలలో నిఘా పెంచాం, లబ్ధిదారులు కూడా రేషన్ బియ్యం సద్వినియోగం చేసుకోవాలి. బియ్యం అక్రమ రవాణా జరిగితే పౌరసరఫరాలశాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– వంశీకృష్ణ, ఎస్సై, వీణవంక

బీసీలను మోసం చేసిన ప్రభుత్వం

విద్యానగర్(కరీంనగర్): బీసీ డిక్లరేషన్ పేరు మీద బీసీలకు అమలు కాని హామీ ఇచ్చి మోసపూరితంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపించిందని యునైటెడ్ పూలే ఫోరం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీసీలకు కొండంత ఆశలు చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు బడ్జెట్‌లో చూస్తే ఇందులో గోరంత కూడా బీసీల సంక్షేమం కోసం కేటాయింపు చేయలేదన్నారు. బీసీ నాయకులు, బీసీ కుల సంఘాలు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

విద్యానగర్(కరీంనగర్): విద్యానగర్ మున్నూరు కాపు సంఘం ఎన్నికలు ఆదివారం విద్యానగర్‌లో జరిగాయి. అధ్యక్షులుగా కనకం అమర్ బాబు, ర్యాకం సుధాకర్ పటేల్ పోటీ పడగా.. మంచి మెజారిటీతో అధ్యక్షుడిగా కనకం అమర్ బాబు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అట్టేపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా ఐల రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా తోట సునీల్, జవ్వాజీ శ్యాంప్రసాద్, నందాడపు మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా పేరుక రాజేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వినయ్ కుమార్, కుదురు రవికుమార్, జుట్టు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా ఉప్పు జలపతి, సానా కార్తీక్ కుమార్, తోట రాజును ఎన్నుకున్నారు.

కన్నుల పండువగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవ సహిత పుష్కర బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారి కల్యాణం మయూరగిరి పీఠాధిపతులు శ్రీనమిలికొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణం గోవిందా నామ స్మరణతో మారుమోగింది. కల్యాణం తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి ఒడి బియ్యం మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న రమణాచార్యులు

చొప్పదండి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవిమాత ఆత్మార్పణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పరమేశ్వరి మాతకు అభిషేకం, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

నూనెగింజల సాగుతో అదనపు ఆదాయం

తిమ్మాపూర్: నూనెగింజల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, తిమ్మాపూర్ వ్యవసాయ అధికారి సురేందర్ తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ, ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూనెగింజల సాగు ప్రోత్సాహంలో భాగంగా భారతీయ నూనెగింజల పరిశోధనా కేంద్రం రాజేంద్రనగర్ అధిక దిగుబడినిచ్చే ఐఎస్ఎఫ్–746 రకం కుసుమ విత్తనాలను రైతులకు పంపిణీ చేశామన్నారు. సంప్రదాయ విత్తనాలకు, పరిశోధనా కేంద్రం అభివృద్ధి చేసిన విత్తనాలకు పంట ఎదుగుదల, దిగుబడి విషయంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పూత దశలో ఉన్న కుసుమ పంటకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కుసుమ నూనెలో విటమిన్–ఇ అధికంగా, ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఒమేగా 6 లినోలెయిక్ యాసిడ్ అని కూడా అంటారు. ఇది శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రణలో ఉంచుతుందని తెలిపారు. లినోలిక్ ఆమ్లం చర్మ సంరక్షణలో ప్రముఖపాత్ర పోషిస్తుంది. కుసుమ నూనె బాడీలో సెరోటిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుందని వివరించారు. రక్తంలోని చక్కెర స్థాయిని కంట్రోల్ చేస్తుందని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గిరిజన శాఖ మంత్రి సీతక్కకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ కోరారు. వరంగల్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఆదివారం సాయంత్రం మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వొడితెల ప్రణవ్ నివాస గృహానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మంత్రికి వివరించగా, సానుకూలంగా స్పందించి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ దొంత రమేశ్, జిల్లా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి చందమల్ల బాబు, మాజీ సర్పంచ్ రఘుపాల్‌రెడ్డి, నాయకులు చందమల్ల నరేష్ తదితరులు ఉన్నారు.



మంత్రి సీతక్కతో చర్చిస్తున్న వొడితెల ప్రణవ్

శ్రీచైతన్యలో వార్షికోత్సవ వేడుకలు

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఆదివారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నరేందర్ రెడ్డి, డీన్ జగన్మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక



ప్రాజెక్ట్‌ను వివరిస్తున్న వైష్ణవి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం జెడ్పీహెచ్ఎస్ పదోతరగతి విద్యార్థినిని బొజ్జ వైష్ణవి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు హెచ్ఎం భూపతి శ్రీనివాస్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. బోరుబావుల్లో చిన్నారులు పడి చనిపోకుండా రక్షణ కవచం తయారు చేయాలన్న ఉద్దేశంతో బోర్లాక్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ రూపొందించింది. ప్రాజెక్ట్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేస్తే బోరుబావుల ప్రమాదం నుంచి చిన్నారులను రక్షించవచ్చని విద్యార్థిని అభిప్రాయం వ్యక్తం చేసింది. బోర్లాక్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైనందుకు విద్యార్థిని ఉన్నతాధికారులు చేతుల మీదుగా అవార్డు అందుకోనుంది. రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైనందుకు మండల విద్యాధికారి కేతిరి వెంకట నర్సింహారెడ్డి గైడ్ టీచర్ లక్కాకుల రాంపప్రసాద్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

17 నుంచి భారతీయ మజ్దూర్ సంఘ్ మహాసభలు

విద్యానగర్(కరీంనగర్): భారతీయ మజ్దూర్ సంఘ్ 4వ రాష్ట్ర త్రైవార్షిక మహాసభలు ఈనెల 17, 18ల్లో జరుగుతాయని, ఈ సభలను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ పప్పుల సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే సభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుల శ్రవణ్, శ్రీనివాస్, గజ్జెల హరికాంత్, నక్క అరుణ్, ఎండీ సుల్తాన్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామాభివృద్ధి ఎమ్మెల్సీ కోట కింద నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం హుజూరాబాద్‌కు వచ్చిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు జూపాక గ్రామ కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ప్రధాన రహదా రిపై బ్రిడ్జి, బస్టాండ్ నుంచి హైస్కూల్ వరకు సీసీరోడ్డు, ఓపెన్ జిమ్, మినీలైబ్రరీ కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణ వ్, నాయకులు ఇల్లందుల శ్రీనివాస్, మారెపల్లి ప్రసాద్, హరీశ్, శ్యాంప్రసాద్, చందు, భరత్, గిన్నారపు అక్షయ్ చక్రి, బీఎస్సీ మండలాధ్యక్షుడు గిన్నారపు మహేందర్ ఉన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్: ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రజలకు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనం వెనక్కి తీసుకొస్తామని, కుటుంబానికి రూ.15 లక్షల పంపిణీ, రైతులకు స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామని 2014 ఎన్నికల ముందు హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ప్రజలపై పెనుభారం మోపుతుందన్నారు. కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడులు తీసుకొస్తూ, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చి మోటార్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తుందని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి దాన్ని ఎత్తివేయాలని చూస్తుందని, మరోపక్క ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటిని ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాని, పెట్టుబడుదారుల ఆస్తులు మాత్రం మోదీ ప్రభుత్వ హయాంలోకోట్లకు పెరిగిపోయి ప్రపంచ కుబేరుల స్థాయికి ఎదిగారని తెలిపారు. వీటన్నింటికీ నిరసనగా జరిగే అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు, రాచర్ల మల్లేశం, బోయినపల్లి రమాపతిరావు, శనిగరపు కొమురయ్య, రవీందర్ రావు, కండె సదయ్య ,కొత్తూరు మల్లయ్య, కదం కిషన్ రావు, కాశిపాక శంకర్, వడ్డూరి లక్ష్మీనారాయణ, బాబు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం



కరీంనగర్‌కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చిందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించడంతో ఆదివారం నగరంలోని ఇందిరా చౌక్ వద్ద మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యంతో పాటు గ్రామీణ, పట్టణ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించారన్నారు. మైనారిటీల సంక్షేమానికి గతంలో కంటే అధిక నిధులిచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రవణ్‌నాయక్, ఎండీ చాంద్, అబ్దుల్ రెహమాన్, లయక్, ఖమ్రొద్దీన్, దన్నసింగ్, షబానా మహమ్మద్, జీడి రమేశ్, సిరాజొద్దీన్, బషీర్, బొబ్బిలి విక్టర్, ఫజల్, ఫిరోజ్, ముక్క భాస్కర్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

గన్నేరువరం: గన్నేరువరం అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలో గన్నేరువరం ప్రీమియం లీగ్ కరీంనగర్ జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ ప్రారంభించారు. నుస్తులాపూర్, తంగళ్లపల్లి జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదటి బహుమతి కింద రూ.20 వేలు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, రెండో బహుమతిగా రూ.10 వేలు బొడ్డు సునీల్ ప్రకటించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ స్వామి, నిర్వాహకులు మంగరాపు, అరుణ్‌సాయి, రాపోలు అరవింద్, లోహిత్, ముడికే అజయ్, మంగరావు అనిల్, వివిధ మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



పతకాలను అందిస్తున్న జాతీయ మాస్టర్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ కమిటీ, నిర్వాహకులు

జమ్మికుంట: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 5వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన మాస్టర్స్ క్రీడా పోటీల్లో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంటకు చెందిన ఎగిత అశోక్ 45 సంవత్సరాల విభాగంలో హైమర్ త్రోలో మొదటి స్థానం, మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్ ద్వితీయ స్థానంలోచి బంగారు, వెండి పతకాలను ఆల్ ఇండియా మాస్టర్స్ స్పోర్ట్ సెక్రెటరీ రామ్‌పాల్ శర్మ, తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. తైవాన్‌లో జరిగే అంతర్జాతీయ మాస్టర్స్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆల్ ఇండియా మాస్టర్స్ స్పోర్ట్స్ కమిటీ ప్రకటించింది. ఎంపిక పట్ల పట్టణంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాకారులు, మేధావులు, ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

‘విద్యార్థుల ఆత్మహత్యలకు యాజమాన్యమే కారణం’

విద్యానగర్(కరీంనగర్): హైదరాబాద్ నారాయణ ఐఐటీ అకాడమీలో శనివారం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థికి న్యాయం చేయలని, విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తూ ఆత్మహత్యలకు కారణమౌతున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ నారాయణ జూనియర్ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ కనీసం నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల మరణాలకు కారణమవుతున్న కోస్తాంధ్ర పెట్టుబడిదారుల కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీకాంత్, నాయకులు బొజ్జే మారుతి, కొయ్యడ రాకేశ్, గాజుల అన్వేష్, మిడిదొడ్డి అజయ్, పర్లపల్లె చందు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

ఒకరికి తీవ్ర గాయాలు

వీణవంక: మల్లారెడ్డిపల్లిలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. గ్రామస్తుల వివరాలు.. మీస వెంకటేశ్ బైక్‌పై చల్లూరు నుంచి మల్లారెడ్డిపల్లికి వెళ్తున్నాడు. ఎదురుగా మరో బైక్ ఢీకొనడంతో వెంకటేశ్‌కు తీవ్ర గాయాలు అయ్యా యి. వెంటనే 108లో జమ్మికుంట ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

సన్మానం



సన్మానిస్తున్న సమితి సభ్యులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన కాసార్ల లచ్చిరెడ్డి ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్‌గా పదవీవిరమణ పొందారు. ఆదివారం వెదిర గ్రామానికి చెందిన సమన్విత సహాయ సమితి ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ధర్మపురి ఎల్ఐసీ శాఖ మేనేజర్ బీరెడ్డి ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఏరెడ్డి కొంరారెడ్డి, సమితి అధ్యక్షులు గాజుల ఆనందం, సభ్యులు పాల్గొన్నారు.

హీరో చిరంజీవిని కలిసిన రమేశ్



శుభాకాంక్షలు తెలుపుతున్న రమేశ్

జమ్మికుంట: చిరంజీవి యువత కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన పర్లపల్లి రమేశ్ హైదరాబాద్‌లో హీరో చిరంజీవిని ఆదివారం ఆయన స్వగృహంలో కలిశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మవిభూషణ్ అవార్డు ప్రకటించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్నారు.

జమ్మికుంట ఎంపీడీవో బదిలీ

జమ్మికుంట: జమ్మికుంట మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఎంపీడీవో) గుమ్మడి కల్పన వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని పంచాయత్‌రాజ్ కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. కల్పన మూడేళ్లుగా ఎంపీడీవోగా విధులు నిర్వహించారు.

ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చొప్పదండి: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని హామ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దనపురి సాగర్ అన్నారు. మండలంలోని రుక్మాపూర్ శివారు కేజీబీవీలోని పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షా సామగ్రిని అందించారు. ఈసందర్భంగా సాగర్ మాట్లాడుతూ... విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో 9.8 జీపీఏ, ఆపై సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేకాధికారి భార్గవి, సభ్యులు గోగూరి శ్రీధర్ రెడ్డి, శ్రీముఖి పటేల్, నాయన్ పటేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు పంపిణీ

చొప్పదండి: పట్టణంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంజూరైన ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం గ్యాస్ సిలిండర్లను ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా అర్హులందరికీ ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్, వెంకటరమణ, కుమార్, సంపత్, చంద్రయ్య, కొక్కుల ప్రణీత్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

లెదర్ పార్క్ నిర్మాణాలపై హర్షం



మాట్లాడుతున్న నాయకులు

జమ్మికుంట: హైదరాబాద్, కరీంనగర్‌లో లెదర్ పార్కులను నిర్మించబోతున్నామని బడ్జెట్‌లో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జమ్మికుంట లెదర్ పార్క్ ఆర్టిజన్స్, చర్మకారులు సంఘం అధ్యక్షుడు రామంచ రాజారాం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... దశాబ్ద కాలంగా లెదర్‌పార్క్‌లు నిర్లక్ష్యానికి గురయ్యాయని, లీడ్‌క్యాప్ భూముల్లో వెంటనే లెదర్ పార్కులను ప్రారంభించి ట్రైనింగ్ పొందిన ఆర్టిజన్స్, మాదిగ నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి రాజేందర్, మొలుగు రాజు, రాచపల్లి మహేశ్, మడిపల్లి రమేశ్, మారెపల్లి పోశెట్టి పాల్గొన్నారు.